# "అసలు కారణం"

శ్రీదేవి

"ఐతే ఇంతకీ పుట్టింటికి రావటం టావు, అంతేగా" అంది అమ్మ విస్తారంగా.

"అనితగాడు అమ్మాగారిని వదిలి ఉండలేడేమోనండీ అత్తయ్యా" హాస్యంగా అంది వదిన.

"మన పల్లెటూరిలా దానికేమి కాలక్షేపం అవుతుందే. ఇక్కడైతే చూడటానికి సినిమాహాల్స్. పార్కులు. పుస్తకాలు ఎన్నో ఉన్నాయి" అంది చెల్లాయి.

"నువ్వు మరీ చెబుతావే చిన్నమ్మాయ్. అది పుట్టిపెరిగింది ఆ పల్లెటూరిలోకాదూ!" అంది అమ్మ కోపంగా.

అందరిమాటలు విని నాలో నేనే నవ్వుకున్నాను. అసలుకారణం నేను ఎలా చెప్పగలను, అనుకున్నాను మనసులో.

ఆ రాత్రి "మీ అమ్మా వాళ్ళు అంత బ్రతిమాలుతుంటే ఎందుకని వెళ్ళటం లేదు" అని అడిగారు.

"నాలుగురోజులలో నిరుపమ వస్తుందిట" అన్నాను.

పకపకా నవ్వి "భయమా!" అన్నారు.

"నేను వెళితే మీరు మళ్ళీ దానితో రాసలీలలు ప్రారంభిస్తారు అది నేను సహించలేను" అన్నాను కోపంగా.

పన్నెండు గంటలయినా నిద్రరావటంలేదు. క్రిందటిసారి నేను నోములకని పుట్టింటికెళ్ళినప్పుడు జరిగిన సంఘటన మనసులో మెదిలి మనసంతా వికలమయిపోయింది.... ...

....శ్రావణ మాసం నోములకని పుట్టింటికి వెళ్ళి పదిరోజులతరువాత తిరిగి వచ్చిన నాకు నా ప్రాణ స్నేహితురాలు అని భావించే నిరుపమ కనిపించలేదు.

ప్రక్కింటి పిన్నిగారిని అడిగాను.

ఆవిడ చెప్పిన మాటలువిని దిమ్మెరపోయాను,

నిరుపమ గర్భవతిట. దీనికి కారకులెవరు?

"ఆ నిత్య శంకితుడితో కాపురం చేయటం నా వలనకాదు" అంటూ సంవత్సరం క్రితం పుట్టింటికి చేరింది నిరుపమ. అతను రెండునెలలకొకసారి వచ్చి దానిని రమ్మని బ్రతిమాలి భంగపడి వెడుతుండేవాడు. కాని ఈసారి నిరుపమ గొడవపెట్టకుండా అతని వెంట వెళ్ళిపోయింది. కారణం ఆమె గర్భవతి

నా ప్రాణ స్నేహితురాలు ఇంత నీచమయిన పని చేసిందా? మనసంతా వికలమయిపోయింది.

ఆరోజు రాత్రి నిరుపమ విషయం అంతా ఆయనతో చెప్పేను.

"అయితే ఈ విషయం అదరికీ తెలిసిందన్నమాట" అన్నారు ఆశ్చర్యంగా.

"అయితే ఈ విషయం మీకు ముందే తెలుసా? ఎలా తెలిసింది?" అని అడిగాను అనుమానంగా చూస్తూ.

"నిరుపమే చెప్పింది దీనికి పరిష్కారం చెప్పమని అడిగింది. నువ్వొస్తే చంపేస్తావనీ, ఈసారి మీ ఆయన తీసుకెళ్ళటానికి వస్తే గొడవచెయ్యకుండా అతనివెంట వెళ్ళిపొమ్మని సలహా యిచ్చాను. నేను చెప్పినట్లే వింది పాపం అమాయకురాలు" అన్నారు నవ్వుతూ.

నాకు వొళ్ళు మండిపోయింది.

"అయితే ఇది మీరుచేసిన ఘనకార్యమేనన్నమాట" అన్నానుకోపంగా.

"మీ ఫ్రెండ్ భర్త దగ్గరకు వెళ్ళటంలేదని నువ్వు బాధపడేదానివిగా, అందుకని భర్త వెంట వెళ్ళేలాచేశాను" అన్నాడు.

ఆయన చెయ్యి నడుంమీదపడటంతో గతంనుంచి వర్తమానంలోకి వచ్చాను. చెయ్యి విసురుగా తీసి లేచి కూర్చున్నాను.

చాప పరుచుకుని పడుకుంటూ "ఈసారి ఏమయినాపరే ఈయనని ఒంటరిగా వదిలి ఎక్కడికీ వెళ్ళకూడదు" అనుకున్నాను దృఢంగా. ★

# కవిత్వం

కవిత్వాన్ని ముందరేసుకొని
నడుస్తుంటాను-
పక్కనే ఎవరో
ఏడుపు ఊబిలో
దిగబడి పోతున్నట్లు
నా కవిత్వం పసిగడుతుంది.
దూట ఎదురుగా కట్టేయబడి
పాలు పిండ బడుతున్న గేదెకళ్ళ
దీనంగా నా కవిత్వం కళ్ళలో
మెదులుతుంటాయి,
కాలిమొచ్చి మీద కూకుండగా
ఉన్నొక్క బక్కెద్దు
కూలబడి పోగా
బక్క రైతు నిరాశాకళ్ళు
నా కవిత్వం శరీరంనిండా
సూదులు గుచ్చుతాయి.
రాడార్ యంత్రంలా
ఎగిరిపోయే ప్రతిదృశ్యాన్నీ
పట్టుకుంటుంది కవిత్వం.
ఫైర్ యింజన్‌లా
దూరంనుంచే
నా గీతంగంట మోగించుకుంటూ
వస్తా
చల్లార్చటానికి మాత్రంకాదు-

సుంకిరెడ్డి నారాయణరెడ్డి